# నిందితులను శిక్షించాలని రాస్తారోకో



ధర్నా చేస్తున్న నాయకులతో మాట్లాడుతున్న ఏసీపీ రాజు

యాచారం, అక్టోబర్16: మండల పరిధిలోని మాల్ మార్కెట్‌లో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి రంగుపూసి ధ్వంసం చేయాలని చూసిన నిందితులను కఠినంగా శిక్షించాలని పలువురు నాయకులు డిమాండ్ చేశారు. అంబేద్కర్ విగ్రహానికి మంగళవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు రంగు పూశారు. విషయం తెలుసుకున్న స్థానికులు బుధవారం ఆందోళన చేపట్టారు. సాగర్ రహదారిపై బైఠాయించారు. ప్రజాసంఘాలు, దళిత సంఘాలతో పాటు పలు పార్టీల నాయకులు రాస్తారోకో చేశారు. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు, యాచారం సీఐ శంకర్‌కుమార్, ఎస్సై మధు సిబ్బందితో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. జరిగిన విషయాన్ని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అంబేద్కర్ విగ్రహానికి రంగు పూసిన దుండగులను గుర్తించి కఠినంగా శిక్షిస్తామని హామీ ఇవ్వడంతో నాయకులు ఆందోళన విరమించారు. అంబేద్కర్ విగ్రహానికి పూసిన రంగును నీళ్లతో శుద్ధి చేశారు. అంబేద్కర్ విగ్రహానికి నాయకులు, పోలీసులు, స్థానికులు క్షీరాభిషేకం చేశారు. విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం దుండగులను శిక్షించాలని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ప్రజా సంఘాల నాయకులు పిర్యాదు చేశారు. కార్యక్రమంలో నాయకులు బట్టు శ్రీనివాస్, మంద లింగం, సంపత్‌కుమార్, చందునాయక్, ముత్యాలు, మహేశ్, గాలయ్య, ఉక్కుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# త్వరలో గీత కార్మికులందరికీ గుర్తింపు కార్డులు

- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి
- గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచాలు అందజేత



గీతకార్మికులకు కాటమయ్య రక్షణ కవచాలు అందజేస్తున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 16: త్వరలోనే రాష్ట్రంలోని గీత కార్మికులందరికీ గుర్తింపు కార్డులు అందజేయాలని ప్రభుత్వం యోచిస్తున్నదని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. బుధవారం ఇబ్రహీంపట్నం క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గీత కార్మికులకు ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను నేరుగా వారికే అందజేయాలనే గుర్తింపు కార్డులు అందజేస్తామన్నారు. గుర్తింపు కార్డులతో నిజమైన గీతకార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు నేరుగా అందుతాయన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో రియల్‌ఎస్టేట్ వ్యాపారం పెరిగినందునా వెంచర్లు వేసేవారు తాటి, ఈతచెట్లను నరికివేస్తున్నండడంతో, గ్రామాల్లో ప్రభుత్వ భూములుంటే వాటిని గీత కార్మికులకు కేటాయించి తాటి, ఈత చెట్లను పెంచేందుకు కృషి చేస్తామన్నారు. 50 ఏండ్లు దాటిన గీత కార్మికులందరికీ పింఛన్ పథకాన్ని వర్తింపజేసే కార్యక్రమాన్ని చేపడుతామన్నారు. గీతకార్మికులు నడుచుకుంటూ, సైకిళ్ల మీద చెట్లు ఎక్కేందుకు వెళ్తున్నారని ప్రభుత్వం నుంచి సైకిల్ మోటర్లు ఇప్పించాలని వారు కోరడంతో మోపెడ్లు ఇప్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

**మత్తుపానీయాలను అరికడదాం..**

తాటి, ఈత కల్లు ఆరోగ్యానికి హానికరమైనవి కావని, వాటిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే అన్నారు. కల్లును మరిపించేలా మార్కెట్‌లోకి నిషేధితమైన గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలు వస్తున్నాయని వాటిని అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి, మాజీ జడ్పీటీసీలు లక్ష్మీపతిగౌడ్, దాసుగౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శేఖర్‌గౌడ్, గురునాథ్‌రెడ్డి, దన్‌రాజ్‌గౌడ్, మంగమ్మతో పాటు కౌన్సిలర్లు మమత, భాను, బాలరాజు, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, ప్రశాంత్, బాలుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు బీఆర్‌ఎస్వీ విస్తృతస్థాయి సమావేశం

బీఆర్‌ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షుడు నిట్టు జగదీశ్వర్



ఇబ్రహీంపట్నంరూరల్, అక్టోబర్ 16 : నగరంలోని తెలంగాణ భవన్‌లో గురువారం నిర్వహించనున్న బీఆర్‌ఎస్వీ విస్తృతస్థాయి సమావేశానికి నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్వీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి రావాలని పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు నిట్టు జగదీశ్వర్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ముఖ్య అతిథిగా హాజరయ్యే ఈ కార్యక్రమానికి ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాలతో పాటు ఇబ్రహీంపట్నం, తుర్కయాంజాల్, పెద్దఅంబర్‌పేట్, ఆదిబట్ల మున్సిపాలిటీల నుంచి బీఆర్‌ఎస్వీ శ్రేణులు ఉదయం 9గంటల వరకు బొంగుళూరు ఓఆర్‌ఆర్ వద్దకు చేరుకోవాలని కోరారు.

# షాబాద్ విద్యుత్ శాఖ ఏఈగా కోటేశ్వర్‌రావు



షాబాద్, అక్టోబర్ 16: షాబాద్ విద్యుత్ శాఖ ఏఈగా కోటేశ్వర్‌రావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకు ముందు ఇక్కడ పని చేసిన ఏఈ నరేందర్ బదిలీపై అబ్దుల్లాపూర్‌మేట్‌కు వెళ్లారు. బంజారాహిల్స్‌లో పని చేస్తున్న కోటేశ్వర్‌రావు బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

**కొత్తూరు ఏఈగా రమేశ్‌గౌడ్**



కొత్తూరు, అక్టోబర్ 16: కొత్తూరు విద్యుత్ శాఖ నూతన ఏఈగా రమేశ్‌గౌడ్ బదిలీపై వచ్చారు. ఇంతకు ముందు ఇక్కడ ఏఈగా పనిచేసిన సాయికృష్ణ షాద్‌నగర్ డివిజినల్ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. రమేశ్‌గౌడ్ కందుకూరు నుంచి ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు, వినియోగదారులకు నిరంతర విద్యుత్ ఇచ్చేందుకు కృషి చేస్తానని చెప్పారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపిస్తానని చెప్పారు. వినియోగదారుల ప్రయోజనాలు కాపాడేందుకు కృషి చేస్తానని వివరించారు.

# రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం

షాద్‌నగర్‌రూరల్, అక్టోబర్ 16: ఫరూఖ్‌నగర్ మండలంలోని ఎలికట్ల నుంచి సర్దార్‌నగర్ వరకు ఉన్న నక్షబాట విస్తరణ పనులను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎలికట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం గ్రామస్తులు మాట్లాడుతూ.. ఎన్నో ఏండ్లుగా ఈ నక్షబాట అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నామన్నారు. ఈ పనులపై ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి విస్తరణ పనులను చేపట్టాలని అధికారులకు తెలియజేశారన్నారు. విస్తరణ పనులు ప్రారంభం కావడంతో గ్రామస్తులు ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు మల్లయ్య, భీమయ్య, మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీశైలం, రాంరెడ్డి, ముత్యాలరాజు, చంద్రయ్య, నర్సింహులు, యాదయ్య పాల్గొన్నారు.



రోడ్డు విస్తరణ పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్తులు

# విధులు సక్రమంగా నిర్వహించాలి



ఎంఈవోకు నియామక ఉత్తర్వులను అందజేస్తున్న నూతన ఉపాధ్యాయులు

చేవెళ్లటౌన్, అక్టోబర్ 16: నూతనంగా ఉద్యోగం పొందిన ఉపాధ్యాయులు తమ విధులను సక్రమంగా నిర్వహిస్తూ విద్యార్థులను తీర్చిదిద్దాలని ఎంఈవో పునందాస్, ఎంపీడీవో హిమబిందు తెలిపారు. డీఎస్సీ 2024లో నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులు బుధవారం చేవెళ్ల మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో ఎంఈవో, ఎంపీడీవోల సమక్షంలో నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, టీయూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి మునీర్ పాషా, మండల ప్రధాన కార్యదర్శి దయానంద్, సీనియర్ టీచర్ వెంకటయ్య, సీఆర్పీలు కిష్టయ్య, శ్రీనివాస్, శంకర్ పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో దక్షిణామూర్తి విగ్రహ ప్రతిష్ఠాపన



విగ్రహ ప్రతిష్ఠాపనకు ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

షాద్‌నగర్‌టౌన్, అక్టోబర్ 16: పట్టణంలోని శివమారుతీగీతా అయ్యప్ప మందిరంలో దక్షిణామూర్తి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ పూజలు బుధవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయని ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఆంజనేయులు, కార్యదర్శి నందీశ్వర్, కోశాధికారి కృష్ణయ్య తెలిపారు. ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. గురువారం ఉదయం 7.10 నిమిషాలకు దక్షిణామూర్తి యంత్రస్థాపన, విగ్రహ స్థాపన, మహాబలి, జయాదిహోమం, పూర్ణాహుతి ఉంటుందన్నారు. విగ్రహ ప్రతిష్ఠాపనకు సహకరించిన దాతలు ఈశ్వరప్ప, చంద్రకాంత్, సత్యనారాయణ, రాంచంద్రారెడ్డి, దేవేందర్‌రెడ్డి, సత్యనారాయణ, రమేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# ఆలయాల్లో ప్రత్యేక పూజలు

నందిగామ, అక్టోబర్ 16: మండల కేంద్రంలో గ్రామ దేవతల విగ్రహ ప్రతిష్ఠాపనలో భాగంగా బుధవారం పోచమ్మ, మైసమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేశ్, మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, సర్పంచ్‌ల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రాంరెడ్డి, ఎంపీటీసీలు చంద్రపాల్‌రెడ్డి, కోమ్ముకృష్ణ, కుమారస్వామిగౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ అశోక్, మాజీ చైర్మన్లు రాంరెడ్డి, విఠల్, నాయకులు పాలమురు విష్ణువర్ధన్‌రెడ్డి, కడెంపల్లి శ్రీనివాస్‌గౌడ్, బాల్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, వెంకటయ్య, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి

# బీఆర్‌ఎస్ హయాంలోని పనులు కొనసాగించాలి

మొయినాబాద్, అక్టోబర్ 16: బీఆర్‌ఎస్ హయాంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించిన పనులను కొనసాగించాలని పార్టీ సీనియర్ నాయకుడు కొత్త నర్సింహారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనేక పథకాలను ప్రారంభించిందని వాటిని సీఎం రేవంత్‌రెడ్డి కొనసాగిస్తే అభినందనీయమన్నారు. రైతుబంధు, కేసీఆర్ కిట్టు తదితర పథకాలను కొనసాగించాలన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# కాంట్రాక్టు వైద్యులకు దరఖాస్తుల ఆహ్వానం

షాబాద్, అక్టోబర్ 16: రంగారెడ్డి జిల్లాలోని దవాఖానల్లో వైద్య సేవలు అందించేందుకు అర్హులు ఈ నెల 19న కొండాపూర్‌లోని జిల్లా దవాఖానలో జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలని జిల్లా కో-ఆర్డినేటర్ హాస్పిటల్ సర్వీసెస్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, కొండాపూర్ దవాఖాన సూపరింటెండెంట్ అనురాగిణిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 20 వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. అన్ని రకాల ప్రత్యేక వైద్యులు తెలంగాణ వైద్య విధాన పరిషత్ కింద పని చేయాల్సి ఉంటుందన్నారు. నెలకు రూ.లక్ష వేతనం చెల్లించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో స్వయంగా హాజరు కావాలని తెలిపారు.

# ప్రమాదవశాత్తు చెరువులో పడి యువకుడు మృతి

షాబాద్, అక్టోబర్ 16: ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ యువకుడు మృతి చెందిన ఘటన షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ కాంతారెడ్డి తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని కేశవగూడ గ్రామానికి చెందిన తోటమీది యాదయ్య (35)గ్రామ పంచాయతీ వర్కర్‌గా పని చేసేవాడు. మంగళవారం మధ్యాహ్నం చెరువులో చేపలు పట్టేందుకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. చెరువులో చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. బుధవారం చెరువులో మృతదేహం పైకి తేలడంతో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీయించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



యాచారం: మొగుళ్లవంపులో గాలికుంటు నివారణ టీకా కార్యక్రమంలో పాల్గొన్న పశువైద్యాధికారిణి రేఖ



ఇబ్రహీంపట్నంరూరల్: మూగజీవాలకు టీకాలు వేయిస్తున్న వైద్యురాలు వసంతకుమారి

# రైతులు అప్రమత్తంగా ఉండాలి



షాబాద్: కుమ్మరిగూడలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేస్తున్న వైద్యసిబ్బంది

షాబాద్, అక్టోబర్ 16: పశువుల ఆరోగ్యం పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని షాబాద్, రేగడిదోస్వాడ పశువైద్యాధికారులు డాక్టర్ స్రవంతి, చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం షాబాద్ మండల పరిధిలోని కుమ్మరిగూడ, కక్కులూర్, తిర్మలాపూర్, మద్దూర్ గ్రామాల్లో వైద్య సిబ్బందితో కలిసి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...పశువులకు వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల రైతులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

**మొగుళ్లవంపు, కుర్మిద్దలో..**

**యాచారం:** మండల పరిధిలోని మొగుళ్లవంపులో మండల పశువైద్యాధికారిణి రేఖ ఆధ్వర్యంలో, కుర్మిద్దలో డాక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం వేర్వేరుగా పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పశువులకు గాలికుంటు నివారణకు టీకాలు తప్పనిసరిగా వేయించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, పాడి రైతులు ఉన్నారు.

**ఇబ్రహీంపట్నంలో..**

**ఇబ్రహీంపట్నంరూరల్:** మూగజీవాలకు తప్పనిసరిగా రోగనిరోధక టీకాలు వేయించాలని పశువైద్యాధికారి వసంతకుమారి అన్నారు. బుధవారం ఇబ్రహీంపట్నంలో ఆవులు, గేదెలకు గాలికుంటు వ్యాధి టీకాలను వేయించారు. ప్రతి ఒక్క రైతు తమ ఆవులు, గేదెలు, దూడలకు టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గోపాల మిత్రుడు మొగిలి జగన్, సిబ్బంది సర్వర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

**తిమ్మాపూర్, పెంజర్లలో..**

**కొత్తూరు:** రైతులు తమ పాడి పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి స్ఫూర్తి అన్నారు. కొత్తూరు మున్సిపాలిటీలోని తిమ్మాపూర్, మండల పరిధిలోని పెంజర్లలో బుధవారం వైద్యాధికారి ఆధ్వర్యంలో గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతుల తమ పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించి సీజనల్ వ్యాధుల నుంచి కాపాడాలని కోరారు. రెండు గ్రామాల్లో కలిసి బుధవారం 448 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశామని ఆమె వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది కృష్ణ, జ్యోతి, రవి, రాజ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

**మహారాజ్‌పేట్‌లో..**

**చేవెళ్ల రూరల్:** పాడి రైతులు పశువులకు గాలికుంటు నివారణ టీకాలు క్రమం తప్పకుండా వేయించాలని శంకర్‌పల్లి మండల పరిధిలోని మహారాజ్‌పేట్ పశువైద్యాధికారి డాక్టర్ శ్రావణి అన్నారు. బుధవారం మహారాజ్‌పేట్‌లో పశువైద్యాధికారి ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 15నుంచి వచ్చే నెల 14 వరకు టీకాలు వేసే కార్యక్రమం నిర్వహిస్తామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.



కొత్తూరు: పెంజర్లలో పశువులకు టీకా వేస్తున్న వైద్యాధికారి స్ఫూర్తి



చేవెళ్ల రూరల్ : మహారాజ్‌పేట్‌లో ఆవుకు టీకా వేసిన పశువైద్యాధికారిణి శ్రావణి

# మహిళ అదృశ్యం



రింకి కందపన్

పెద్దఅంబర్‌పేట, అక్టోబర్ 16: ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన వివాహిత తిరిగి రాలేదు. ఈ ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. ఒడిశాకు చెందిన రింకి కందపన్ తన భర్త అశ్విన్, ఐదేండ్ల పాపతో కలిసి అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని బండరావిరాల గ్రామంలో ఉంటున్నారు. వీరు కూలీ పని చేసుకుంటూ జీవిస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం భర్త కూలీకి వెళ్లగా.. పాపను ఇంట్లోనే వదిలి రింకి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అశ్విన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

# చోరీకి పాల్పడిన యువకుడు అరెస్ట్

షాద్‌నగర్, అక్టోబర్ 16: ఓ ఇంట్లో చోరీకి పాల్పడిన యువకుడిని షాద్‌నగర్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కడియాలకుంట గ్రామ పంచాయతీ పరిధిలోని బూర్గు గడ్డ తండాలో ఈ నెల 13న నేనావత్ లచ్చిరామ్ ఇంట్లో అదే తండాకు చెందిన మూడవత్ మణిరామ్ చోరీకి పాల్పడ్డాడు. ఇంట్లో ఉన్న 50 తులాల వెండి కాళ్ల కడియాలు, రూ. 9,800 నగదును దోచుకెళ్లారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారించగా చోరీకి పాల్పడినట్లు తెలిపారు. నిందితుడి నుంచి చోరీకి గురైన నగదుతో పాటు వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నామని షాద్‌నగర్ సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు

# అనుమతి లేకుండా తాటి, ఈత చెట్లను నరకొద్దు

ఆమనగల్లు, అక్టోబర్ 16: అనుమతి లేకుండా తాటి, ఈత, ఖర్జూర చెట్లను నరికితే కఠిన చర్యలు తప్పవని ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యానాథ్ చౌహాన్ తెలిపారు. పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ మాట్లాడారు. ఆమనగల్లు ప్రొహిబిషియన్, ఎక్సైజ్ శాఖ పరిధిలోని ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా ఈత, తాటి చెట్లతో పాటు గెలలు నరికిన వారిపై చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు.

# 27న మాల మహానాడు సభ



మాల మహానాడు సభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాల మహానాడు సంఘం నాయకులు

షాద్‌నగర్, అక్టోబర్ 16: మాలల ఆత్మగౌరవ సభ పేరుతో ఈ నెల 27న నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో మాల మహానాడు బహిరంగ సభను నిర్వహిస్తున్నామని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మహేశ్‌మాల బుధవారం తెలిపారు. షాద్‌నగర్ పట్టణంలో బుధవారం మాల మహానాడు సభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాలలను అణిచి వేసేందుకు కుట్రచేస్తున్నాయని, మనువాద పార్టీలు మాలలకు అన్యాయం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని మండిపడ్డారు. మాలల సత్తా ఏమిటో చూపేందుకు ప్రతి మాల కుటుంబం నుంచి కుటుంబ సభ్యులు అందరూ తరలిరావాలని పిలుపునిచ్చారు. జిల్లాతో పాటు షాద్‌నగర్ నియోజకవర్గంలోని మాలల ఉద్యోగస్తులు, మేధావులు, విద్యార్థులు, వివిధ సంఘాల నాయకులు, మహిళలు నాగర్‌కర్నూల్ సభలో పాల్గొని మన ఆత్మగౌరవాన్ని చాటాలన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు అర్జున్‌కుమార్, రాంచందర్, మహేందర్‌మాల, జగన్, వినోద్, సుంకం నర్సింహులు, అశోక్, కుమార్, షణ్ముఖ శ్రీనివాసులు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# కూలీలకు సరైన ఉపాధి కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీవో లక్‌పతినాయక్

ఇబ్రహీంపట్నంరూరల్, అక్టోబర్ 16: గ్రామాల్లో కూలీలకు సక్రమంగా పనులు కల్పించాలని ఇబ్రహీంపట్నం ఎంపీవో లక్‌పతినాయక్ అన్నారు. మండల పరిధిలోని ముకునూరులో బుధవారం ఉపాధి హామీ పథకంపై పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఉపాధి హామీ పనులకు వచ్చే కూలీలకు సక్రమంగా పనులు కల్పించడంతో పాటు పని ప్రదేశంలో అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని కోరారు. సమావేశంలో ఫీల్డ్ అసిస్టెంట్ లింగం తదితరులు పాల్గొన్నారు.

# బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే చర్యలు తప్పవు



రోడ్లపై చెత్త వేసిన వారికి జరిమానా వేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ వంకాయల యాదగిరి

బడంగ్‌పేట, అక్టోబర్ 16: బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే చర్యలు తప్పవని శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వంకాయల యాదగిరి హెచ్చరించారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పెద్ద బావి మల్లారెడ్డి గార్డెన్ సమీపంలో నాలాపై చెత్త వేస్తున్న వారిని పట్టుకొని రూ.5వేల జరిమానా వేసినట్లు ఆయన పేర్కొన్నారు. తడి, పొడి చెత్తను వేరు చేసి స్వచ్ఛ ఆటోల్లో వేయాలన్నారు. ఖాళీ స్థలాలు, రోడ్లు, పార్కులు, చెరువుల్లో ఎవరైనా చెత్త వేస్తే చర్యలు తీసుకొంటామన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన కాలనీ వాసులకు సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. మున్సిపల్ కార్పొరేషన్‌కు సహకరించాలన్నారు.